TELANGANA CAPITAL

# తెలంగాణ క్యాపిటల్

నిజం.. నిజాయితీ.. నిబద్ధత

TELANGANA CAPITAL NEWS

www.telanganacapitalnews.com

హైదరాబాద్ | సంపుటి : 1 సంచిక: 113 | ఆదివారం, ఆగస్టు 25, 2024 | కంప్లిమెంటరీ కాపీ | పేజీలు : 4

### చెరువులు కాపాడటమే...

## మా లక్ష్యం



హైదరాబాద్: చెరువులను కాపాడటమే తమ లక్ష్యమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ప్రముఖ తెలుగు సినీ నటుడు నాగార్జునకు చెందిన హైదరాబాద్‌లోని ఎన్ కన్వెన్షన్ సెంటర్ కూల్చివేతపై తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క స్పందించారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన ఈ కూల్చివేతలపై స్పందిస్తూ... కేవలం బఫర్ జోన్‌లోనే కాదని, ఏకంగా చెరువులోనే అక్రమ నిర్మాణాలు చేపట్టారన్నారు. నోటీసులు ఇచ్చిన తర్వాతే తాము అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజల ఆస్తులను కాపాడటం ప్రభుత్వం బాధ్యత అన్నారు. తాము ఆ ప్రకారమే ముందుకు సాగుతున్నామన్నారు. అక్రమ నిర్మాణాలపై చట్టప్రకారమే చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. చెరువులు ఆక్రమణకు గురికాకుండా చూసేందుకే తమ ప్రభుత్వం హైడ్రాను ఏర్పాటు చేసిందన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో ఎన్ని చెరువులు ఆక్రమణకు గురయ్యాయో తెలుసుకుంటున్నామన్నారు. శాటిలైట్ ఫొటోలతో సహా ప్రజల ముందు ఉంచుతామన్నారు.

### మోడీ, యోగిని పొగిడినందుకు...

## భార్యకు ట్రిపుల్ తలాఖ్

లక్నో: అయోధ్యలో జరిగిన అభివృద్ధిని చూసి ప్రధాని నరేంద్ర మోడీ, ఉత్తర్ ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను పొగిడినందుకు తన భర్త తనకు ట్రిపుల్ తలాఖ్ ఇచ్చినట్లు ఉత్తర్‌ప్రదేశ్‌లోని బహరాయిచ్‌కు చెందిన ఒక ముస్లిం మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఆమె భర్త, ఇతర కుటుంబ సభ్యులపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. తన భర్తతోపాటు అత్త, ఇతర బంధువులు తనను కొట్టారని, తన గొంతు నులిమి చంపేందుకు ప్రయత్నించారని కూడా ఆ మహిళ ఆరోపించింది. బహరాయిచ్‌లోని మొహల్లా సరాయ్‌లో నివసించే ఒక మహిళకు 2023 డిసెంబర్ 13న అయోధ్యలో నివసించే అర్షద్‌తో వివాహమైందని బహరాయిచ్‌లోని జార్వాల్ రోడ్డు పోలీసు స్టేషన్ ఇన్‌చార్జ్ ఇన్‌స్పెక్టర్(ఎస్‌హెచ్‌ఓ) బ్రిజ్‌రాజ్ ప్రసాద్ శనివారం తెలిపారు. వివామైన తర్వాత మొదటిసారి అయోధ్యకు వెళ్లిన ఆ మహిళకు అక్కడి రోడ్లు, నగర సుందరీకరణ, అభివృద్ధి, వాతావరణం బాగా నచ్చాయని, దీంతో ఆమె తన భర్త సమక్షంలోనే ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, ప్రధాని నరేంద్ర మోడీని పొగిడారని ఆయన తెలిపారు. ఆ పొగడ్తలను తట్టుకోలేకపోయిన ఆమె భర్త పప్పు ఉడుకుతున్న వేడి ప్యాన్‌ను ఆమెపైన విసిరాడని, అంతేగాక ఆమెను వెంటనే ఆమెను ఆమె పుట్టింటికి పంపించివేశాడని ఎస్‌హెచ్‌ఓ తెలిపారు.



## నిర్మలా సీతారామన్‌తో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క భేటీ



న్యూఢిల్లీ: తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఢిల్లీ పర్యటనలో ఉన్నారు. అందులో భాగంగా ఇవాళ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కలిశారు. తెలంగాణ ఆర్థిక పరిస్థితిని వివరించి.. రాష్ట్ర అభివృద్ధికి సహకరించాల్సిందిగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరాం అన్నారు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. మొత్తం 8 అంశాలను ఆర్థికమంత్రి దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. విభజన చట్టంలోని నిధుల పంపకం త్వరితగతిన చేయాలని కోరినట్టు వెల్లడించారు భట్టి. గత ప్రభుత్వం చేసిన అప్పులు రాష్ట్రానికి భారంగా మారాయని, ప్రతినెలా జీతాలకంటే ఎక్కువగా అప్పులు, వాటి వడ్డీలు చెల్లించేందుకే పోతున్నాయని తెలిపారు. చెరువులు, కొండలను కాపాడాలనేదే తమ లక్ష్యమని, హైడ్రాకు ప్రజలు సహకరించాలని భట్టి కోరారు. చట్టం ప్రకారమే నిర్ణయాలు ఉంటాయన్నారు. లెక్కలతో సహా ఎన్ని చెరువులు కబ్జాకు గురి అయ్యాయో ప్రజల ముందు పెడతామని డిప్యూటీ సీఎం భట్టి అన్నారు.

### జిట్టాను పరామర్శించిన...

## మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్: బీఆర్ఎస్ నేత జిట్టా బాలకృష్ణారెడ్డి గత కొన్ని రోజులుగా తీవ్ర అస్వస్థతతో సికింద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కాగా, అనారోగ్యంతో బాధపడుతున్న బాలకృష్ణారెడ్డిని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పరామర్శించారు. బాలకృష్ణారెడ్డికి అందుతున్న చికిత్స వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి... మీరంతా ధైర్యంగా ఉండాలని, జిట్టా కోలుకుంటున్నారని డాక్టర్లు చెప్పినట్లు వారికి తెలిపారు.





## నాకు ఒక్క నోటీస్ ఇవ్వకుండా కూల్చేశారు: నాగార్జున

హైదరాబాద్: ఎన్ కన్వెన్షన్ కూల్చివేతపై సినీ హీరో నాగార్జున స్పందించారు. హైకోర్టు ఉత్తర్వులకు విరుద్ధంగా ఎన్ కన్వెన్షన్ కూల్చివేతలు బాధాకరమైన విషయమని పేర్కొన్నారు. అధికారులు చట్టవిరుద్ధంగా చేసిన చర్యలపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని, చట్టాన్ని ఉల్లంఘించేలా తాము ఎలాంటి చర్యలు చేపట్టలేదని, ఉదయం కూల్చివేతకు ముందు తమకు ఎలాంటి నోటీసులు ఇవ్వలేదని, కూల్చివేత కోసం గతంలో ఇచ్చిన అక్రమ నోటీసుపై కోర్టు స్టే ఇచ్చిందని తెలియజేశారు. కేసు కోర్టులో ఉన్నప్పుడు ఇలాంటి చర్యలకు పాల్పడడం సరికాదని, తప్పుడు సమాచారంతో చట్ట విరుద్ధంగా కూల్చివేశారని మండిపడ్డారు. తాను చట్టాన్ని గౌరవించే పౌరుడినని, కోర్టు తనకు వ్యతిరేకంగా తీర్పు ఇస్తే తానే కూల్చివేతను నిర్వహించేవాడినని, తాజా పరిణామాలతో ప్రజలకు తప్పుడు సంకేతం వెళ్లే అవకాశం ఉందన్నారు. దీంతో తాము అక్రమాలకు పాల్పడ్డామని ప్రజలకు తప్పుడు సంకేతాలు వెళ్తాయని నాగార్జున తన బాధను వ్యక్తం చేశారు. మాది పట్టాభూమి అని, ఒక్క అంగుళం కూడా ఆక్రమించలేదని, ప్రైవేటు స్థలంలోనే భవనం నిర్మించామని చెప్పారు. మాదాపూర్‌లోని ఎన్ కన్వెన్షన్ ను హైడ్రా అధికారులు కూల్చివేసిన విషయం తెలిసిందే.

## మహిళా కమిషన్ ముందుకు మాజీ మంత్రి కెటిఆర్


హైదరాబాద్: బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ రాష్ట్ర మహిళా కమిషన్ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా కెటిఆర్‌ను అడ్డుకునేందుకు మహిళా కాంగ్రెస్ కార్యకర్తలు ప్రయత్నం చేశారు. ఈ క్రమంలోనే కెటిఆర్ వ్యాఖ్యలకు వ్యతిరేకరంగా నిరసన వ్యక్తం చేశారు. కాగా రాష్ట్ర మహిళా కమిషన్, బుద్ధ భవన్ ఆఫీసు దగ్గర తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఆర్టిసి బస్సుల్లో ప్రయాణిస్తున్న మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కారణంగా మాజీ మంత్రి కెటిఆర్‌కు ఉమెన్ కమిషన్ నోటీసులు ఇచ్చింది. ఈ క్రమంలో మహిళా కమిషన్ ముందు వివరణ ఇచ్చేందుకు ఆఫీసుకు వెళ్లిన కెటిఆర్ కు నిరసనసెగ తగిలింది. కెటిఆర్ వస్తున్న నేపథ్యంలో మహిళా కాంగ్రెస్ నేతలు కమిషన్ దగ్గరకు పెద్ద ఎత్తున చేరుకున్నారు. ఇక మహిళా కమిషన్ కార్యాలయానికి చేరుకునేందుకు వస్తున్న కెటిఆర్ వాహనాన్ని అడ్డుకునేందుకు మహిళా కాంగ్రెస్ కార్యకర్తలు ప్రయత్నం చేశారు. కెటిఆర్‌కు వ్యతిరేకంగా స్లోగన్స్ చేశారు. మహిళలకు కెటిఆర్ తక్షణమే క్షమాపణలు చెప్పాలంటూ డిమాండ్ చేశారు. దీంతో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా బిఆర్ఎస్ కార్యకర్తలు అక్కడే నిరసనకు దిగారు. పోలీసులు వెంటనే స్పందించి అక్కడ ఉన్న వారిని అడ్డుకున్నారు. ఈ క్రమంలో బుద్ధ భవన్ దగ్గర తోపులాట, ఉద్రికత్త చోటు చేసుకుంది. ఈ తోపులాటలో పలువురు గాయపడినట్టు సమాచారం. మరోవైపు.. బిఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగినట్టు కూడా తెలుస్తుంది.



### త్వరలో సరికొత్తగా విద్యుత్...

## నియంత్రణ మండలి

**హైదరాబాద్:** తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి ఏర్పాటు దిశగా ప్రభుత్వం వేగం పెంచింది. రానున్న రెండు మాసాల్లో టీజీఈఆర్‌సీ పదవీ కాలం ముగిసి ఈ మండలి మొత్తం ఖాళీ కానుంది. ఈ నేపథ్యంలో తదుపరి పాలక మండలి దిశగా ప్రభుత్వం సన్నాహాలు అనివార్యమయ్యాయి. డిస్కమ్‌ల వార్షిక ఆదాయ అవసరాలు (ఏఆర్ఆర్), టారిఫ్ ప్రతిపాదనలతో పాటు విద్యుత్ సంస్థల ఏ పిటిషన్ విచారించడానికి ఈ కమిషన్ ఏర్పాటు తక్షణావసరం కానుంది. 2019 అక్టోబరులో నియమితమైన ప్రస్తుత ఛైర్మన్, సభ్యుల పదవీ కాలం అక్టోబరు 29వ తేదీతో ముగియనుంది. విద్యుత్తు చట్టం-2003లోని సెక్షన్-85 ప్రకారం ఛైర్మన్, సభ్యులు ఐదేళ్లు లేదా 65 ఏళ్లు నిండే వరకే పదవిలో ఉండాలి. దీంతో కొత్తగా మొత్తం పాలక మండలి నియామకం ఆనివార్యంగా మారింది. కాగా, విభజన అనంతరం ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు రెండు కమిషన్లు ఏర్పడగా.. ఏపీలో హైకోర్టు రిటైర్డ్ ప్రధాన న్యాయమూర్తులనే ఛైర్మన్లుగా నియమించడం ఆనవాయితీగా కొనసాగుతూ వచ్చింది.




## హైడ్రా పేరుతో హైడ్రామా నడుస్తోంది : కిషన్ రెడ్డి

హైదరాబాద్: హైడ్రా పేరుతో హైడ్రామా నడుస్తోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు. గతంలో అక్రమ నిర్మాణాలకు అనుమతులు ఇచ్చిన ప్రభుత్వమే ఇప్పుడు కూల్చివేతలు చేస్తోందన్నారు. అప్పుడు ఎలా అనుమతులు ఇచ్చారు..? అక్రమ నిర్మాణాలకు రోడ్లు, విద్యుత్, నీటి సదుపాయం ఎలా కల్పించారని ప్రశ్నించారు. గతంలో అనుమతులిచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని, అక్రమ నిర్మాణాలపై సమగ్ర చర్చ జరగాలని, ఏ చర్యలైనా, చట్టమైనా అందరికీ సమానంగా వర్తింప చేయాలన్నారు.

# 41కి చేరిన నేపాల్ రోడ్డు ప్రమాద మృతుల సంఖ్య



**పొఖారా:** నేపాల్‌లో సంభవించిన రోడ్డు ప్రమాదంలో మృతుల సంఖ్య 41 కి చేరింది. దాదాపు 43 మంది ప్రయాణికులతో నేపాల్ లోని పొఖారా నుంచి కాఠ్మండ్‌కు శుక్రవారం ఈ బస్సు బయలుదేరింది. రోడ్డుపై అదుపు తప్పి 150 అడుగుల లోతులో ప్రవహిస్తున్న మార్స్యాంగడి నదిలోకి పడిపోయింది. ఈ ప్రమాదంలో మొత్తం 41 మంది చనిపోయారని ,ప్రయాణికులు ఎంతమందో ఇంకా కచ్చితంగా తెలియవలసి ఉందని, 12 మందిని ఆస్పత్రికి నేపాల్ ఆర్మీ తరలించారని మహారాష్ట్ర మంత్రి మహాజన్ చెప్పారు. ఢిల్లీ లోని దౌత్య కార్యాలయంతో తాము సంప్రదింపులు జరుపుతున్నామన్నారు. ప్రయాణికుల్లో చాలా మంది మహారాష్ట్ర లోని జలగావ్ జిల్లాకు చెందిన వారు. ప్రయాణికులు ఇంకా మరో 16 నుంచి 18 వరకు ఎక్కువ ఉండవచ్చని వారు చనిపోయి ఉండవచ్చని చెప్పారు. అంతకు ముందు మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, ఇతర సీనియర్ కేంద్ర అధికారులతో మృతదేహాలను స్వదేశానికి రప్పించే ఏర్పాట్లుపై చర్చించారు. నేపాల్ నుంచి నాసిక్‌కు ఆదివారం ప్రత్యేక విమానం ద్వారా 24 మృతదేహాలు వస్తాయని కుటుంబీకులకు వాటిని అప్పగిస్తారని తెలుస్తోంది.

# విధానాల రూపకల్పనకు కుల గణనే పునాది: రాహుల్



ప్రయాగ్‌రాజ్: దేశవ్యాప్తంగా కుల గణన చేపట్టాలని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ శనివారం మరోసారి డిమాండు చేశారు. దేశ జనాభాలో 90 శాతం మంది వ్యవస్థ బయట ఉన్నారని, వారి ప్రయోజనాలను కాపాడేందుకు చర్యలు తీసుకోవలసిన ఆవశ్యకత ఉందని ఆయన స్పష్టం చేశారు. విధానాల రూపకల్పనకు కుల గణన పునాదేగాక ముఖ్యమైన సాధనమని కూడా రాహుల్ అభిప్రాయపడ్డారు. శనివారం నాడిక్కడ సంవిధాన్ సమ్మాన్ సమ్మేళనంలో రాహుల్ ప్రసంగిస్తూ..సమాజంలోని వివిధ వర్గాలను భాగస్వాములను చేయడానికి ముందు వారి జనాభా సంఖ్యను నిర్ధారించుకోవలసిన అవసరం ఉందని అన్నారు.


కుల గణన లేకుండా దేశ వాస్తవ పరిస్థితిని అవగతం చేసుకోలేమని, విధానాల రూపకల్పనకు కుల గణన అత్యంత ముఖ్యమైన సాధనమేకాక పునాదని కాంగ్రెస్ భావిస్తోందని రాహుల్ నఅద్నరు. ప్రస్తుతం నిత్యం దాడిని ఎదుర్కొంటున్న భారత రాజ్యాంగాన్ని మార్గదర్శకంగా ఎలా పరిగణిస్తున్నామో సామాజిక-ఆర్థిక సర్వే అయిన కుల గణనను కూడా రెండవ మార్గదర్శకంగా తాము పరిగణిస్తామని ఆయన చెప్పారు. దళితులు, ఓబిసీలు, ఇతర వెనుకబడిన కులాలు, గిరిజనులు, మహిళలు, మైనారిటీలు, ఉన్నత కులాలకు చెందిన జనాభా ఎంత ఉందో తెలుసుకోవడానికి కుల గణన ఒక్కటే మార్గమని ఆయన తెలిపారు. కుల గణన నిర్వహించాలన్న డిమాండు ద్వారా రాజ్యాంగాన్ని పరిరక్షించడానికి తాము ప్రయత్నిస్తున్నామని రాహుల్ అన్నారు. దేశ జనాభాకు చెందిన 10 శాతం మంది కోసం రాజ్యాంగం లేదని, అది ప్రజలందరి కోసం ఉందని ఆయన స్పష్టం చేశారు.

రాజ్యాంగాన్ని కాపాడుతున్నది పేద ప్రజలు, కార్మికులు, గిరిజనులేనని, (గౌతమ్)అదానీ కాదని రాహుల్ వ్యాఖ్యానించారు. 90 శాతం మంది ప్రజలకు భాగస్వామ్య హక్కు లేనిపక్షంలో రాజ్యాంగాన్ని పరిరక్షించలేమని ఆయన అన్నారు. రాజ్యాంగాన్ని పరిరక్షించడమే తమ లక్ష్మని, పేదలు, రైతులు, కార్మికులకు రాజ్యాంగం రక్షణ కవచమని రాహుల్ ప్రకటించారు. రాజ్యాంగమే లేకపోతే పూర్వకాలంలో ఇష్టారీతిన పాలించిన రాజుల కాలం నాటి పరిస్థితులు ఏర్పడతాయని ఆయన అన్నారు. రాజులు, చక్రవర్తుల తరహా పాలనను తీసుకురావడానికి ప్రధాని నరేంద్ర మోడీ ప్రయత్నిస్తున్నారని ఆయన ఆరోపించారు. మిమల్ని మీరు(మోడీ) దైవాంశసంభూతులుగా భావిస్తున్నారు. దేవుడితో మిమల్ని మీరు పోల్చుకుంటున్నారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత రాజ్యాంగం ముందు మీరు తలవంచవలసి వచ్చింది. ఇది మేము చేసిన పని కాదు..ప్రజలు చేసిన పని అని రాహుల్ వ్యాఖ్యానించారు. కల గణను నిలిపివేయగలమని, రిజర్వేషన్లపై ఉన్న 50 శాతం గరిష్ఠ పరిమితిని పెంచడం సాధ్యం కాదని భావించేవాడివి పగటి కలలని, దేశ ప్రజలు కుల గణనకు ఇప్పటికే తమ సమ్మతి తెలిపారని ఆయన అన్నారు. ప్రజల ఆదేశాలు ఇప్పటికే వచ్చాయని, ప్రధాని మోడీ కూడా దాన్ని ఆమోదించి అమలు చేయాలని ఆయన తెలిపారు. ప్రధాని ఆ పని చేయకపోతే ప్రధానిగా మరొకరు వస్తారని రాహుల్ వ్యాఖ్యానించారు. 2004లో తాను రాజకీయాల్లోకి వచ్చిన నాటి నుంచి బిజెపి పార్టీ నాయకులు తననుచికాకు పరుస్తున్నారని ఆయన అన్నారు.

### నేను తప్పు చేయలేదు.. ఆ టెస్టుతో నిజాలు బయటకు వస్తాయి...

# కోల్‌కతా వైద్యురాలిపై హత్యాచార ఘటనలో నిందితుడు



కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లోని కోల్‌కతా వైద్యురాలిపై హత్యాచారం ఘటన దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ ఘటనలో నిందితుడు సంజయ్‌రాయ్‌ను కోర్టులో సిబిఐ అధికారులు హాజరుపరిచారు. పాలీగ్రాఫ్ పరీక్షలకు నిందితుడు సమ్మతించడంతో కోర్టు అధికారులకు అనుమతి ఇచ్చింది. నిందితుడు సంజయ్‌రాయ్ న్యాయస్థానంలో నోరువిప్పాడు. భావోద్వేగంతో మాట్లాడాడు. తనని కావాలని ఈ కేసులో ఇరికించారని కన్నీళ్లు పెట్టుకున్నారని జాతీయ మీడియాలో వార్తలు వచ్చాయి. పాలీగ్రాఫ్ ఎందుకు అంగీకరించావని జడ్జి ప్రశ్నించడంతో అతడు కన్నీంటి పర్యంతమయ్యాడు. తాను అమాయకుడిని సర్, తప్పు చేయలేదని, తనని ఈ కేసులో ఇరికించారని స్పష్టం చేశారు. పాలీగ్రాఫ్ పరీక్షతో అసలు నిజాలు బయటకు వస్తాయని భావోద్వేగానికి గురయ్యారు. అతడితో మరో ఏడుగురికి పాలిగ్రాఫ్ పరీక్షలు నిర్వహించేందుకు కోర్టు అనుమతి ఇచ్చింది. లై డిటెక్టర్ పరీక్షకు సిబిఐ అధికారులు సన్నద్ధమవుతున్నారు.

సంజయ్‌రాయ్ కోర్టులో మాట్లాడిన విధానం చూస్తే సంచలన విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. సిబిఐ విచారణలో మాత్రం సంజయ్ నేరం అంగీకరించినట్లుగా జాతీయ మీడియాలో కథనాలు వెలువడిన విషయం తెలిసిందే. సంజయ్ మానసిక స్థితిని సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరికి చెందిన వైద్యబృందం పరీక్షించింది. వైద్యురాలు హత్యాచారానికి సంబంధించిన ప్రతి విషయాన్ని పూసగుచ్చినట్టుగా సిబిఐ అధికారులకు వివరించాడు. నిందితుడు చెబుతున్నప్పుడు అతడి ముఖంలో పశ్చాత్తాపమే కనిపించలేదని సిబిఐ అధికారులు చెప్పిన విషయం తెలిసిందే. వైద్య విద్యార్థిపై హత్యాచారం జరిగిన రోజు అర్థరాత్రి సమయంలో ఆర్‌జి కర్ మెడికల్ కాలేజీ నుంచి నిందితుడు వెళ్తున్న దృశ్యాలు సిసి కెమెరాలో రికార్డయ్యాయి. వాటిని తాజాగా దర్యాప్తు అధికారులు విడుదల చేశారు. నిందుతుడి మెడ చుట్టూ బ్లూటూత్ ఇయర్‌ఫోన్స్ కూడా కనిపించాయి. వైద్యురాలి మృతదేహం వద్ద ఉన్న బ్లూటూత్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సిసి కెమెరాల దృశ్యాల ఆధారంగానే సంజయ్‌ను అరెస్టు చేసిన విషయం తెలిసిందే.

### 75వ ఏట మోడీ రిటైర్ కావాల్సిందే.. లేకపోతే:

# సుబ్రమణ్య స్వామి సంచలన వ్యాఖ్యలు





న్యూఢిల్లీ : బిజెపిలో ఇప్పటి ఫైర్‌బ్రాండ్ ఎంపి, మాజీ మంత్రి సుబ్రమణ్యస్వామి ప్రధాని మోడీపై మరోసారి విరుచుకుపడ్డారు. సెప్టెంబర్ 17న మోడీ 75వ ఏడాదిలోకి ప్రవేశిస్తారు. ఆ రోజున ఆయన ఖచ్చితంగా, ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారక్ సంస్కార్‌కు కట్టుబడి మార్గ్ దర్శన్ మండల్ ముందు రాజకీయాల నుంచి నిష్క్రమించాల్సి ఉంటుంది. ఆయనే స్వయంగా ఈ రిటైర్మెంట్ ప్రకటన చేయాల్సి ఉంటుంది. ఒక వేళ ఇది చేయకుండా కొనసాగితే ఆయనను ఇతరత్రా పద్ధతులతో పదవీచ్యుతులను చేయాల్సి వస్తుందని స్వామి సంచలనాత్మక హెచ్చరికలు వెలువరించారు. మోడీపై %తీఓ% ఇటీవలి కాలంలో ఈ బిజెపి అసంతృప్తి నేత తరచూ విమర్శలకు దిగుతున్నారు. గత వారం ఆయన మోడీ హయాంలో జిడిపి దిగజారిందని, అయితే ఎగబాకిందని ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. ఇప్పుడు ఏకంగా ఆయన పక్కకు వైదొలిగి, కొత్త వారికి అవకాశం ఇవ్వాల్సి ఉందని పిలుపు నిచ్చారు. ఓ వైపు ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విదేశీయుడు అని పేర్కొంటూ, కోర్టులను కూడా ఆశ్రయిస్తూ, మరో వైపు పాలక పక్ష నేత మోడీపై కూడా చెడుగుడుకు దిగుతున్నారు. బిజెపి సంస్థాగత అంతర్గత సంవిధానంలో భాగంగా నేతలకు వయోపరిమితి నిబంధన అలిఖితంగా అమలులో ఉంది. దీని మేరకు ఏ వ్యక్తి అయినా తన 75వ ఏడాదిలోకి వస్తే రంగంలో నుంచి తెరమరుగు కావాల్సి ఉంటుంది, కొత్త తరానికి స్థానం కల్పించాలి. ఇంతకు ముందటి నేతలు ఈ విధానాన్ని పాటించారని స్వామి తరచూ చెపుతున్నారు. దీనిని మోడీ పాటిస్తే సరి లేకపోతే ఆయనను ఏ విధంగా సాగనంపాలనేది తేల్చుకుంటామని, దీనికి తమ వద్ద పలు ఇతర మార్గాలు ఉన్నాయని కూడా స్వామి ప్రకటించారు. పనిలో పనిగా స్వామి భారతదేశ సమగ్రతకు మోడీ అవలంభిస్తున్న విధానాలు భంగకరం అవుతాయని అభిప్రాయపడ్డారు. ఇరుగుపొరుగు దేశాలతో ఆయన వ్యవహార శైలి వల్ల ఆయా దేశాలు కక్ష కట్టడం జరుగుతుంది. ఈ క్రమంలో దేశంలోని పలు ప్రాంతాల్లో అస్థిరత నెలకొంటుందన్నారు. మాల్దీవులు, ఇటు బంగ్లాదేశ్‌లలో తలెత్తిన పరిణామాలను ఇప్పటికైనా మోడీ గుర్తించాల్సి ఉంటుందని స్వామి సూచించారు. చైనా, పాకిస్థాన్, శ్రీలంక చివరికి నేపాల్, మరో వైపు సమీపంలోని దీవులతో కూడా మోడీ అనుసరిస్తున్న వ్యూహం చివరికి మన కొంప ముంచే స్థాయికి తెస్తుందన్నారు.

# కర్నాటక వాల్మీకి స్కామ్‌తో తెలంగాణ నేతలకు లింకేంటి?: కెటిఆర్

హైదరాబాద్: కర్నాటకలో పెను ప్రకంపనలు సృష్టిస్తున్న వాల్మీకి స్కామ్‌తో తెలంగాణ రాష్ట్ర, నేతలు, వ్యాపారవేత్తలకు సంబంధాలు ఉన్నాయని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ తెలిపారు. కర్నాటక ఎస్‌టి కార్పొరేషన్ నుంచి తెలంగాణకు రూ.45 కోట్లు బదిలీ చేశారని తన ట్విట్టర్‌లో కెటిఆర్ పోస్టు చేశారు. పార్లమెంటు ఎన్నికల ముందు 45 కోట్ల రూపాయల నగదు డ్రా చేసిన బార్లు, బంగారు దుకాణాల యజమానులు ఎవరు అని అడిగారు. బార్లు, బంగారు దుకాణాల యజమానులతో కాంగ్రెస్ పార్టీకి ఉన్న సంబంధం ఏంటని ఆరోపణలు చేశారు. హైదరాబాద్‌లోని తొమ్మిది మంది బ్యాంకు ఖాతాలకు కర్నాటక నుంచి నగదు బదిలీ జరిగిందని, ఈ కుంభకోణం గురంచి సిటి, సిఐడి, ఇడి సోదాలు చేసిందని, కానీ వార్తలు బయటకు రాకుండా అణచివేశారని కెటిఆర్ మండిపడ్డారు. కర్నాటక అసెంబ్లీలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య రూ.90 కోట్ల అవినీతి జరిగిందని చెప్పారని, సిద్ధరామయ్యను తొలగిస్తే తెలంగాణ ప్రభుత్వం కూడా కూలిపోతుందని కర్నాటక మంత్రి ఆరోపణలు చేసిన విషయాన్ని కెటిఆర్ ప్రస్తావించారు. తెలంగాణ ప్రభుత్వం కూలుతుందని కర్నాటక మంత్రి సతీష్ జారా కిహొలీ ఎందుకు అన్నారని నిలదీశారు. రూ.90 కోట్ల అవినీతి గురించి సిఎం మాట్లాడిన దానిపై ఇడి ఎందుకు మౌనంగా ఉందని కెటిఆర్ ప్రశ్నించారు. తెలంగాణలో కాంగ్రెస్‌ను ఎవరు రక్షిస్తున్నారని కెటిఆర్ అడిగారు.

# యుద్ధ భూమిలో ప్రధాని మోడీ

కీవ్: భారత ప్రధాని నరేంద్ర మోడీ ఉక్రెయిన్ చేరుకున్నారు. రష్యా ఉక్రెయిన్ మధ్య చల్లారని ఘర్షణలు , పరస్పర భయానక దాడుల ప్రాంతంలో ప్రధాని మోడీ పర్యటన చారిత్రాత్మకం అయింది. రష్యా ఉక్రెయిన్ మధ్య ఘర్షణను నివారించే ప్రతిపాదనలతో వెళ్లుతున్నానని, యుద్ధం ఎప్పుడూ పరిష్కారానికి మార్గం కాదని చెప్పిన మోడీ శుక్రవారం తొలిసానిగా రాజధాని కీవ్‌కు చేరారు. భారతీయ ప్రధాని ఉక్రెయిన్‌లో పర్యటించడం ఇదే తొలిసారి.. 1991లో స్వాతంత్ర్యం పొందిన తరువాత ఈ దేశానికి ఏ భారత ప్రధాని రాలేదు. ఓ వైపు ఉక్రెయిన్ సేనలు రణవ్యూహాలకు పదును పెడుతూ రష్యా పశ్చిమ కర్స్కు ప్రాంతంపై వ్యూహాత్మక దాడిని సాగిస్తూ ఉన్న దశలోనే ప్రధాని మోడీ ఉక్రెయిన్‌కు చేరారు. భారతదేశం రష్యా వైపు మొగ్గుచూపుతున్నదనే విమర్శల నేపథ్యంలో మోడీ ఇక్కడికి రావడం అంతర్జాతీయ కీలక పరిణామం అయింది. ఘ ర్షణ దశలో పర్యటన ఓ విధంగా ఆయన యుద్ధ భూమిలోకి అడుగుపెట్టినట్లే అయిందని పరిశీలకులు వ్యాఖ్యానించారు.

ఉక్రెయిన్‌లో పది గంటల పర్యటనకు మోడీ పో లండ్ పర్యటన తరువాత వార్సా నుంచి కీవ్‌కు చేరారు. సదిగం టల పాటు ఆయన రైలులో ప్రయాణించి కీవ్‌కు చేరా రు. ఆయనను వచ్చిన మోడీ తొలుత కీవ్‌లోని అమరుల స్మారక స్థలికి చేరారు. అక్కడ ఉక్రెయిన్ అధ్యక్షులు జె లెన్‌స్కీ మోడీకి స్వాగతం పలికారు. మోడీ ఆయనను ఆ త్మీ య ఆలింగనం చేసుకున్నారు. దాడులలో మృతి చెందిన చి న్నారులకు మోడీ నివాళులు అర్పించారు.ఇటువంటి యు ద్ధాలు భావితరాలకు ప్రత్యేకించి అన్నెంపున్నెం తెలియని ప సిపాపలకు చితిపేర్చాయని, ఎందరి పిల్లలనో అనాధలు చేశాయని మోడీ వ్యాఖ్యానించారు. ఇక్కడి సంక్షోభాన్ని తెలిపే ఛాయాచిత్రాలతో కూడిన నేషనల్ మ్యూజియంను జెలెన్‌స్కీ వెంట ఉండి ప్రధాని మోడీకి చూపించారు.

ఇక్కడి మల్టీమీడియా మార్టిరాలిజిస్ట్ ఎగ్జిబిషన్ వెలుపల అమరులైన చిన్నారుల ఆటబొమ్మలు, వారు వాడిన వస్తువులను పేర్చి ఉంచారు. ఇది చిన్నారుల జ్ఞాపకం అని జెలెన్‌స్కీ ఆవేదనతో చెప్పారు. ఇక్కడ మోడీ ఓ నిమిషం మౌనంగా నిలబ డి నివాళులు అర్పించారు. కీవ్‌లోనే



ఒయాసిస్ ఆఫ్ పీస్ పా ర్క్‌లో నెలకొని ఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి మోడీ నివాళులు అర్పించారు. బాపూజీ చూపిన బాటలోనే ప్రపంచ యుద్ధాలకు పరిష్కారం దక్కుతుందని, ఇది అత్యవసరం అని స్పందించారు. కాలాతీతంగా మహాత్మా గాంధీ అహింసా వాదం, ఆయన బోధనలు వర్తిస్తాయని, యుద్ధ భయాల ప్రపంచానికి పరిష్కారం అవుతాయని తెలిపారు. ప్రధాని మోడీ రైలులో కీవ్ చేరుకోగానే రైల్వేస్టేషన్‌లో ఆయనకు భారతీయ సంతతి వారు స్వాగతం పలికారు. ఉక్రెయిన్‌లోని ఇస్కాన్ బృందం ప్రధానికి స్వాగతం పలికారు. స్టేషన్ వద్ద ప్రధాని మోడీకి వందలాది మంది భారతీయులు త్రి వర్ణ పతాకాలతో అభివాదాలు తెలిపారు. భారత ప్రధాని ఇక్కడ ముందుగా ఆ తరువాత దఫాల వారిగా జెలెన్‌స్కీతో మాట్లాడుతారు. ఇది ఇద్దరి మధ్య ముఖాముఖిగా ఉం టుంది. తరువాత ఇరుదేశాల బృందాల స్థాయి సమావేశం జ రుగుతుందని ముందుగా వెలువరించిన ఏడుగంటల కా ర్యక్రమాల అజెండాలో తెలిపారు. ఈ పర్యటన ఇందుకే అని కూడా మోడీ ప్రకటించారు. ప్రధాని కొద్ది సేపు బస చేసిన హ్యాత్ హెూటల్ వెలుపల కూడా భారతీయ సంతతి వారు ఆయనకు అభివాదాలు తెలిపారు.

**నాలుగు ఒప్పందాలపై సంతకాలు**

భారత ప్రధాని నరేంద్ర మోడీ ఉక్రెయిన్ పర్యటన దశలో హుటాహుటిన ఇరు దేశాల నడుమ నాలుగు కీలక ఒప్పందాలు కుదిరాయి. మోడీ జెలెన్‌స్కీ చర్చల తరువాత వ్యవసాయం, ఆహార పరిశ్రమ, ఔషధాలు, సాంస్కృతిక, మావనవీయ సాయం వంటి విషయాపై ఒప్పందాలు కుదిరినట్లు అధికారులు తెలిపారు. ఇంతకు ముందు ఇటలీలో జి 7 సదస్సు నేపథ్యంలో జెలెన్‌స్కీ మోడీ కొద్ది సేపు మాట్లాడుకున్నారు. ఆ తరువాత మోడీ ఉక్రెయిన్‌కు రావడం, జెలెన్‌స్కీతో చర్చించడం ఇప్పుడు జరిగింది.

# సంపాదకీయం

ఆదివారం, ఆగస్టు 25, 2024

## బిజెపికి సవాల్ విసురుతున్న హర్యానా

కిందటిసారి 2019 అక్టోబరులో హర్యానా అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికల్లో ఏ పార్టీకి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేంతటి మెజారిటీ రాలేదు. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి 40 గెలుచుకుంది. దుష్యంత్ చౌతాలా నాయకత్వంలోని జన్నాయక్ జనతా పార్టీకి 10 సీట్లు లభించాయి. దీంతో బిజెపి, జన్నాయక్ జనతా పార్టీలు కలిసి సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేశాయి. మనోహర్‌లాల్ ఖట్టర్ తొలిసారి హర్యానా ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. అయితే బిజెపి, జెజెపి మధ్య విభేదాలు తలెత్తాయి. చాలా కాలం ఈ విభేదాలు నడిచాయి. అయితే చివరకు ఈ ఏడాది మార్చి నెలలో సంకీర్ణ ప్రభుత్వం పడిపోయింది. మనోహర్‌లాల్ ఖట్టర్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. హర్యానా ప్రభుత్వంపై వ్యతిరేకత ఉన్న విషయాన్ని బిజెపి అధిష్టానం గుర్తించింది. రైతుల ఆందోళన, అగ్నిపథ్ పథకం, నిరుద్యోగం వంటి అంశాలతోపాటు పదేండ్ల పాలనపై సహజంగా ఉండే ప్రజావ్యతిరేకత బిజెపికి మైనస్‌గా మారాయి. హర్యానా అసెంబ్లీ ఎన్నికలు బిజెపికి సవాల్‌గా మారాయి. దాదాపు రెండేళ్ల కిందట కేంద్ర ప్రభుత్వం అట్టహాసంగా ప్రారంభించిన అగ్నిపథ్ పథకం, బిజెపికి మైనస్ పాయింట్‌గా మారనుంది. అగ్నిపథ్ మెరికల్లాంటి యువతకు సైన్యంలో కొలువులు కల్పించడమే ఈ పథకం ప్రధాన లక్ష్యం. అయితే సైన్యంలో కొలువు అంటే ఓ ఇరవై ఏళ్లో లేదా పాతికేళ్లో అని అందరూ భావిస్తారు. కనీసం పదిహేనేళ్లు అయినా ఉంటుందని ఆశిస్తారు. అయితే అగ్నిపథ్ పథకంలో కేంద్రం ఇచ్చే ఉ ద్యోగం కేవలం నాలుగేళ్లే ఉంటుంది. పదిహేడు నుంచి ఇరవై ఒక్క ఏళ్ల మధ్య వయసులో ఉన్న యువకులు ఈ పథకానికి అర్హులు. విద్యార్హతలు కూడా పెద్దగా అవసరం లేదు. ఇంటర్మీడియట్ లేదా పదో తరగతి పాసయితే చాలు. అగ్నిపథ్‌కు ఎంపికైన వాళ్లను వాళ్లవాళ్ల అర్హతలను బట్టి ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్ ఇలా ఎందులోనైనా భర్తీ చేస్తారు. సర్వీస్ కేవలం నాలుగేళ్లే అయినా వేతనం మాత్రం ఆకట్టుకునేలా ఉంటుంది. మొదటి ఏడాది నెలకు ముప్ఫయి వేలు ఇస్తారు. రెండో ఏడాది ముప్ఫయి మూడు వేలు ఇస్తారు. మూడో ఏడాది అయితే ముప్ఫయి ఆరు వేల అయిదు వందల వేతనం ఉంటుంది. ఇక చివరగా నాలుగో ఏడాది నెలకు నలభై వేలు వేతనంగా ఇస్తారు. అగ్నిపథ్ పథకంలో భాగంగా సైన్యంలో కొలువులు చేసేవారిని అగ్నివీరులుగా పిలుస్తారు. నాలుగేళ్ల సర్వీస్‌కు కార్పస్ ఫండ్ కింద కొంత అమౌంట్ కూడా జమ చేస్తారు. అయితే నాలుగేళ్ల సర్వీసు పూర్తయిన తరువాత అగ్నివీరులు ఇంటికి పోవాల్సిందే. మరో ప్రత్యామ్నాయం లేదు. అయితే అగ్నివీరులు నిరుత్సాహపడకుండా వారికి భవిష్యత్తులో అనేక అవకాశాలు కల్పిస్తామని కేంద్ర ప్రభుత్వ పెద్దలు ఆశ పెడుతున్నారు. ఇందు కు సంబంధించి కేంద్ర ప్రభుత్వం నుంచి ఎటువంటి హామీ లేకపోవడం విశేషం. మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే నాలుగేళ్ల సర్వీసు పూర్తి చేసిన అగ్నివీరులకు ఆ తరువాత ఎటువంటి పెన్షన్ సౌకర్యం ఉండదు. అంతిమంగా సైన్యంపై ఎలాంటి అదనపు ఆర్థిక భారం ఉండదు. భారత సైన్యంపై సిబ్బంది వేతనం, పెన్షన్ భారాన్ని తగ్గించడమే ప్రధాన లక్ష్యంగా అగ్నిపథ్ పథకాన్ని రూపొందించింది కేంద్రం. హర్యానాలోని మెజారిటీ యువకులు స్కూల్ ఫైనల్ పాసవ్వగానే సైన్యంలోకి భర్తీ అవడానికి ప్రయత్నిస్తారు. దాదాపు ఇరవై ఏళ్ల సర్వీసు పూర్తయిన తరువాత అందరూ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులులాగే పెన్షన్ సౌకర్యానికి అర్హులవుతారు. అయితే కేంద్ర ప్రభుత్వం రెండేళ్ల కిందట ప్రారంభించిన అగ్నిపథ్ పథకంలో పెన్షన్ సౌకర్యం ఉండదు. అంతేకాదు నాలుగేళ్ల సర్వీసు తరువాత మళ్లీ కొత్తగా ఉద్యోగం వెతుక్కోవాల్సిందే. దీంతో బిజెపి నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై హర్యానా యువత ఆగ్రహంతో రగిలిపోతోంది. ప్రభుత్వంపై వ్యతిరేకతను తగ్గించేందుకు తొమ్మిదిన్నరేండ్లు ముఖ్యమంత్రిగా ఉన్న మనోహర్‌లాల్ ఖట్టర్‌ను తప్పించి ఇటీవల నాయబ్ సింగ్ సైనీని ముఖ్యమంత్రిని చేసింది. ఇదిలా ఉంటే ప్రజలను ఆకర్షించడమే పనిగా వరాలు ప్రకటించి కర్ణాటక, తెలంగాణ ఎన్నికల్లో సక్సెస్ అయిన ఫార్ములానే హర్యానాలోనూ కాంగ్రెస్ పార్టీ నమ్ముకున్నది. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వృద్ధులకు నెలకు రూ.6,000 పింఛను, 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, రూ. 500 కే గ్యాస్ సిలిండర్లు ఇస్తామని హామీలు ఇచ్చింది. బిజెపి ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకత కలిసొస్తుందని కాంగ్రెస్ ఆశిస్తోంది. కాగా ఈసారి ఎన్నికల్లో త్రిముఖ పోటీ జరిగే అవకాశాలున్నాయి. దాదాపుగా అన్ని సీట్లలో బిజెపి, కాంగ్రెస్, జెజెపి మధ్య తీవ్ర పోటీ ఉండే అవకాశాలున్నాయి. ఎన్ని మైనస్ పాయింట్లు ఉన్నా హర్యానా ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీకి ఉన్న క్లీన్ ఇమేజ్‌పైనే బిజెపి ప్రధానంగా ఆధారపడుతోంది. అంతేకాదు కేంద్రంలో బిజెపి అధికారంలో ఉండటం కూడా దానికి ప్లస్ పాయింట్‌గా మారింది. డబుల్ ఇంజన్ నినాదంతో దూసుకుపోవాలని బిజెపి భావిస్తోంది. అయితే బిజెపిపై ప్రజల్లో ఉన్న ఆగ్రహం ఏమేరకు తగ్గుముఖం పడుతుందన్నది వేచి చూడాల్సిందే.

# కేరళ స్కూల్లో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

– కృష్ణుడు, గోపిక, రాధల వేషధారణలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన విద్యార్థులు – సంబరాల మధ్య ఉట్టి కొట్టే కార్యక్రమం





**తెలంగాణ క్యాపిటల్ న్యూస్, వేములవాడ:** శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలను పురస్కరించుకొని వేములవాడ పట్టణంలోని కేరళ మోడల్ స్కూల్‌లో శనివారం ఘనంగా జరుపుకున్నారు.వేడుకల్లో భాగంగా చిన్నారి విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలబాలికలు చిన్ని కృష్ణుడు, గోపిక, రాధల వేషధారణలతో చూపరులను ఆకట్టుకున్నారు. రాధాకృష్ణుల జీవిత చరిత్రను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించి అవగాహన కల్పించారు.పిల్లన గ్రోవితో చిన్నారులు ఆటా పాటలు అందరినీ అలరించాయి. అనంతరం ఉట్టికొట్టే కార్యక్రమాన్ని చిన్నారి కృష్ణులు అత్యంత సంబరాల మధ్య ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# విజ్ఞాన్ హైస్కూల్లో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు

**తెలంగాణ క్యాపిటల్ న్యూస్ గన్నేరువరం:** గన్నేరువరం మండల కేంద్రంలోని విజ్ఞాన్ హై స్కూలు లో శనివారం రోజున ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించనైనది ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు కృష్ణుని మరియు గోపికల వేషాదర్ణలో ఉట్టి కొట్టే సాంప్రదాయం మరియు కృష్ణుడి జన్మ దిన పురస్కరించుకొని కృష్ణాష్టమి వేడుకల ప్రాముఖ్యతను విద్యార్థులు ప్రదర్శనలు ఆకట్టుకున్నారు . దాదాపు 150 మంది విద్యార్థిని విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని ఉట్టి పగలగొట్టి సంతోషంతో స్వీట్స్ పంపిణీ చేసుకున్నారు ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బూర వెంకటేశ్వర్ ప్రిన్సిపాల్ భుర భాను చైతన్య వాయిస్ ప్రిన్సిపాల్ లతా పాఠశాల ఉపాధ్యాయ బృందం నామ్దేవ్ రేణుక శిరీష శ్వేత లాస్య సమత లత మరియు విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# యువత ప్లేట్లెట్లు దానం చేయడానికి ముందుకు రావాలి.. డెంగ్యూ రోగుల ప్రాణాలు కాపాడండి

**నాగర్ కర్నూల్:24** ఆగస్టు జిల్లా కేంద్రంలోని నెల్లికొండ ప్రభుత్వ సైన్స్ డిగ్రీ & పీజీ కలశాల విద్యార్థులకు ప్లేట్లేట్స్ దానంపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్రటరీ రమేష్ రెడ్డి మాట్లాడుతూ.. డెంగ్యూ రోగుల ప్రాణాలు కాపాడేందుకు యువత ప్లేట్లెట్లు దానం చేయడానికి ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ప్రతి చోటా సీజనల్ వ్యాధులతో బాధపడుతున్నారనీ అన్నారు. డెంగ్యూ కేసుల్లో ప్లేట్లెట్లు చాలా వేగంగా పడిపోతుండటంతో రోగులకు ప్రాణాపాయం కలుగుతున్న పరిస్థితి ఉందని తెలిపారు. ఈ సంక్షోభాన్ని అధిగమించడానికి యువత ముందుకు వచ్చి ప్లేట్లెట్లు దానం చేయడం ఆవశ్యకమని రమేష్ రెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమంలో జనరల్ ఆసుపత్రి ఆర్.ఎమ్.ఓ. డా. దశరథం మాట్లడుతూ.. గత కొద్దిరోజులుగా డెంగీ వ్యాధి విపరీతంగా విస్తరిస్తోంది. డెంగీ వైరస్ సోకిన కొందరిలో ప్లేట్లెట్ల సంఖ్య వేగంగా తగ్గిపోతుంటుందన్న విషయం తెలిసిందే. ఇది ప్రాణాలకు అపాయం తెచ్చే పరిస్థితి. కానీ డెంగీ పెచ్చరిల్లుతున్న ఈ సమయంలో ప్లేట్లెట్లు ఇవ్వడం చాలా మంది ప్రాణాలను కాపాడుతుంది. డెంగీ రోగుల్లో ప్లేట్లెట్ల ఆవశ్యకత, వాటిని ప్రదానం చేయాల్సిన అవసరం ఉందిఅప్లాస్టిక్ అనీమియా, కొన్ని రకాల రక్తపు క్యాన్సర్ల (లుకేమియా)లో అవకాశలున్నాయి. అలాగే అనేక వైరల్ జబ్బులతో పాటు ముఖ్యంగా డెంగీలో ప్లేట్లెట్స్ సంఖ్య బాగా తగ్గిపోవచ్చు. ప్లేట్లెట్స్ తగ్గినప్పుడు బాధితుడికి రక్తస్రావం లేదా దేహంలోనే అంతర్గత రక్తస్రావం జరిగే అవకాశం ఉంటుంది. అలాంటప్పుడు ప్లేట్లెట్స్ ఎక్కించకపోతే ప్రాణాలకే ప్రమాదం. సాధారణంగా ప్లేట్ లెట్ల సంఖ్య నాలుగు లక్షల నుంచి 80,000 వరకు పడిపోయినా ఎలాంటి ఆపద రాదు. కానీ అవి 20,000 కంటే తక్కువకు పడిపోయినప్పుడు బాధితుడు ప్రమాదకరమైన స్థితిలోకి వెళ్తాడు. అప్పుడు ఏ చిన్నపాటి గాయమైనా అది చాలా ప్రమాదకరంగా పరిణమిస్తుంది. అప్పుడు ప్లేట్లెటు ఎక్కించడం అవసరమవుతుంది. చూడ్డానికి రక్తమంతా ఒకే ద్రవంలా కనిపిస్తుంటుందిగానీ.. అందులో ఎర్రరక్తకణాలు, తెల్లరక్తకణాలు, ప్లేట్లెట్స్, ప్లాస్మా వంటి అంశాలుంటాయన్నది తెలిసిందే. అందులో ప్లేట్లెట్లు కూడా చాలా కీలకమైనవే. ఇవి గాయాలైనప్పుడు లేదా ఇతరత్రా కొన్ని ప్రమాదకరమైన పరిస్థితుల్లో రక్తాన్ని గడ్డకట్టేలా చేసి, రక్తస్రావాన్ని నివారించి ప్రాణాలు కాపాడుతుంటాయి. కౌంట్ తక్కువగా ఉన్నవారికి ప్లేట్లెట్స్ ఎక్కించడం (ట్రాన్స్ ఫ్యూజన్) రెండు రకాలుగా జరుగుతుంది.



అవి... 1.ర్యాండమ్ డోనార్ ప్లేట్లెట్స్ : బ్లడ్బ్యాంకుల్లో అనేక మంది అనేక మంది దాతల నుంచి రక్తాన్ని సేకరిస్తుంటారు. అందువల్ల ఏ రక్తం ఎవరిదన్న విషయం తెలియదు. అందుకే ఇలా సేకరించిన ప్లేట్లెట్లను 'ర్యాండమ్ డోనార్ ప్లేట్లెట్స్' (ఆర్డీపీ)గా చెబుతారు. 'ఆర్డీపీ'ని ఎక్కించినప్పుడు పేషెంట్లో 5,000 వరకు మాత్రమే కౌంట్ పెరుగుతుంది. కానీ సురక్షితమైన స్థాయికి ప్లేట్లెట్లను పెంచాలంటే, కౌంట్ కనీసం 25,000 నుంచి 30,000 ఉండాలి. ఇందుకోసం 'ర్యాండమ్ డోనార్ ప్లేట్లెట్స్' ప్రక్రియలో కనీసం 5 నుంచి 6 యూనిట్ల రక్తం అవసరమవుతుంది. అంటే ఒకరికి అవసరమైన ప్లేట్లెట్లను సేకరించాలంటే కనీసం ఐదారుగురు దాతలు కావాలి. కొందరు రోగుల్లో వారి వ్యాధిని బట్టి నాలుగైదు మార్లు ప్లేట్లెట్స్ ఎక్కించాల్సి రావచ్చు. అంటే పేషెంట్కు కావాల్సిన ప్లేట్లెట్స్ అందాలంటే కనీసం 30 మంది దాతలు కావాలి. అంతమంది దాతలు దొరకడం చాలా కష్టం. 2.సింగిల్ డోనార్ ప్లేట్లెట్స్ : వైద్యరంగంలో ఇప్పుడున్న ఆధునిక సాంకేతికత సహాయంతో ఒక్క దాత నుంచే అవసరమైన పరిమాణంలో ప్లేట్లెట్స్ సేకరించవచ్చు. ఇలా చేసేప్పుడు రక్తంలోని ఇతర అంశాలను కాకుండా కేవలం ప్లేట్లెట్స్ మాత్రమే సేకరిస్తారు. ఇలా సేకరించేవాటిని 'సింగిల్ డోనార్ ప్లేట్లెట్స్' (ఎస్‌ఏపీ) అంటారు. ఈ ప్రక్రియలో ఒకే దాత... బాధితుడికి అవసరమైనన్ని అంటే... దాదాపు 30,000 ప్లేట్లెట్ కౌంట్ సమకూరేలా వాటిని దానం చేస్తాడు. దానివల్ల దాతకు ఎలాంటి నష్టమూ ఉండదు. కేవలం నాలుగురోజుల్లోనే దాత రక్తంలోకి అవి తిరిగి భర్తీ అవుతాయి. అంతేకాదు.. మళ్లీ ఎవరికైనా అవసరమైతే.. అదే దాత కేవలం 10 రోజుల తర్వాత మళ్లీ ప్లేట్లెట్స్ దానం చేయవచ్చు. అలాకాకుండా, మొత్తం రక్తదానం చేసినప్పుడు... ఆ రక్తమంతా భర్తీ కావడానికి కనీసం మూడు నెలల వ్యవధి అవసరం. అందుకే ప్లేట్లెట్స్ అవసరమైనప్పుడు దాతలు ఎలాంటి అపోహలకు తావులేకుండా ప్రతి పదిరోజులకోమారు కూడా ప్లేట్లెట్స్ను నిరభ్యంతరంగా దానం ఇవ్వవచ్చు. పైగా ఇటీవలి కాలంలో ఇది చాలామంది ప్రాణాలు కాపాడుతూ పలువురికి మేలు చేస్తుంది. ప్లేట్లెట్స్ ఎముక మూలుగ నుంచి పుడతాయి. వీటి జీవిత కాలం కేవలం నాలుగు రోజులు మాత్రమే. సాధారణంగా ఎముక మూలుగలో ఏదైనా సమస్య వస్తే ప్లేట్లెట్స్ ఉత్పత్తి తగ్గుతుంది. రక్తంలో వీటి సంఖ్య తగ్గినప్పుడు రక్తం గడ్డకట్టే మన స్వాభావిక రక్షణ ప్రక్రియకు విఘాతం కలుగుతుంది. ఆరోగ్యవంతుడైన ఓ వ్యక్తిలో క్యూబిక్ మిల్లీమీటర్ పరిమాణంలో 1.5 లక్షల నుంచి 4.5 లక్షల ప్లేట్లెట్స్ ఉండాలి. ఇది నార్మల్ కొలత. వీటి సంఖ్యను 'సెల్ కౌల్టర్ మెషిన్' అనే యంత్రం ద్వారా కొలుస్తారు. ప్లేట్లెట్ కౌంట్ కోసం 2 – 3 ఎమ్ఎల్ రక్తాన్ని సేకరిస్తారు. డెంగీవ్యాధిగ్రస్తుల్లో ప్లేట్లెట్ కౌంట్ తెలుసుకోవడం కోసం ప్రతి 24 గంటలకోమారు రక్తపరీక్ష నిర్వహిస్తుండాలి. రక్తం గడ్డకట్టే జీవక్రియల్లో ప్లేట్లెట్స్‌ని అనేక ప్రోటీన్లు పాలు పంచుకుంటాయి. వీటిని 'క్లాటింగ్ ఫ్యాక్టర్స్' అంటారు. ఇవన్నీ ఒక వలలా ఏర్పడి రక్తం ప్రవహించకుండా ఓ అడ్డుకట్ట వేస్తాయి. గాయం అయ్యాక కేవలం 2, 3 నిమిషాల్లోనే ఈ వల ఓ ఆనకట్టలా ఏర్పడుతుందనీ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ రెడ్ క్రాస్ కన్వీనర్ కుమార్ మాట్లడుతూ.. కలశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం మరియు కలశాల విద్యార్థులను సమన్వయం చేసుకొని ప్లేట్లేట్స్ అవసరమైన వారికి తక్షణమే స్పందించేలా యూత్ రెడ్ క్రాస్ వింగ్ నీ ఏర్పాటు చేసి బాధితులకు తక్షణ సాయం అందేలా చేద్దామని డోనేట్ ప్లేట్లేట్స్ సేవ్ లైవ్ అనే నినాదంతో కలసి పనిచేద్దామని అన్నారు. కలశాల ప్రిన్సిపాల్ ఉమరే మాట్లాడుతూ.. కళాశాలలో ప్లేట్లెట్లు దానంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం విద్యార్థులను సేవా కార్యక్రమాలలో బాగం చేయటం సంతోషంగా ఉందని ఈ కార్యక్రమం విజయవంతం కోసం తమ వంతు పూర్తి సహకారం అందిస్తామని అన్నారు. న్సిపాల్ ఉమేర, యుత్ రెడ్ క్రాస్ జిల్లా కన్వీనర్ కుమార్, అధ్యాపకులు రమేష్, కోదండరామ్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.




## బాక్సాఫీస్ ను షేక్ చేస్తున్న స్త్రీ 2...

బాలీవుడ్ బ్యూటీ శ్రద్ధా కపూర్, రాజ్‌కుమార్ రావ్ నటించిన హార్రర్ కామెడీ మూవీ 'స్త్రీ 2'. ఆగస్ట్ 15న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా మొదటి ఆట నుంచే పాజిటివ్ టాక్‌తో బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల సునామీ సృష్టిస్తోంది. ఈ సినిమా ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా రూ.456 కోట్లకు పైగా వసూలు చేసింది. ఈ క్రమంలో, 2024 సంవత్సరంలో అత్యధిక వసూళ్లు సాధించిన బాలీవుడ్ చిత్రాలలో ఒకటిగా నిలిచింది. నార్త్ లోనే కాకుండా సౌత్ లో కూడా ఈ సినిమా భారీ కలెక్షన్స్ రాబడుతోంది. ఈ సినిమా 9వ రోజు ఇండియాలో దాదాపు రూ.17 కోట్లు వసూలు చేసింది. దీంతో ఈ సినిమా ఇండియాలో రూ.327 కోట్లకు పైగా నెట్ కలెక్షన్స్ సాధించి అరుదైన మైలురాయిని దాటేసింది.



## మోడ్రన్ రాధ గెటప్‌లో తమన్నా

మిల్క్‌బ్యూటీ తమన్నా గురించి చెప్పనక్కర్లేదు. ట్రెండ్‌ను తనకు అనుకూలంగా మార్చుకోవడంతో పాల పాపకు తెలిసినట్టు ఎవరికీ తెలీదు. ఇండస్ట్రీలోకి వచ్చిన రెండు దశాబ్దాలు గడుస్తున్నా.. ఇప్పుడొస్తున్న బ్యూటీలకు తాను ఏ మాత్రం తీసిపోనంటోంది. ఆ రేంజ్‌లో న్యూ కమ్మర్స్‌కు సవాల్ విసురుతోంది. తమన్నా దూడుకు చూసి షాకవుతున్నవాళ్లు లేకపోలేదు. 34 ఏళ్లు వచ్చినా తానింకా యంగ్ అంటూ చెప్పే ప్రయత్నం చేస్తోంది. తాజాగా కృష్ణాష్టమి సమీపిస్తున్న తరుణంలో తమన్నా మోడ్రన్ రాధా మాదిరిగా మిలమిల మెరిసిపోయింది.

ట్రెడిషనల్ డ్రెస్సులో అభిమానులను చూపు తిప్పుకోలేని విధంగా అందాలు ఆరబోయడంతో సోషల్‌మీడియాలో ఆమె ఫోటోలు గిరగిరా తిరిగేస్తున్నాయి. తమన్నా స్టన్నింగ్ లుక్‌లో యువరాణి మాదిరిగా మెరిసిపోయింది. లోకేషన్‌కు తగ్గట్టుగా పింక్ బ్లౌజ్‌లో సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. సింపుల్‌గా చెప్పాలంటే నావల్ల ఆ దుస్తులకు అందం వచ్చిందనే రీతిలో కనిపించింది. పురాణాల్లో రాధా ఏమోగానీ, కలియుగంలో రాధా సూపర్బ్ అంటున్నవాళ్లూ లేకపోలేదు. దాదాపు రెండు దశాబ్దాల కెరీర్‌లో బెస్ట్ ఫోటోషూట్‌గా చెబుతోంది తమన్నా.

## రూటు మార్చిన... అనుపమ



తక్కువ మేకప్ లేదా అసలు మేకప్ లేకుండా హాట్ ఫొటోలకు పోజులివ్వడం ఒక్క అనుపమ పరమేశ్వరన్ కే చెల్లింది. అనుపమ పరమేశ్వరన్ కేవలం 19 ఏళ్లకే సినిమాల్లో ఎంట్రీ ఇచ్చింది. మలయాళంలో 2015లో వచ్చిన ప్రేమమ్ సినిమాతో ఆమె ప్రేక్షకులు, సినీ విమర్శకుల నుంచి ప్రశంసలు అందుకుంది. కేవలం 4 రూ.కోట్లలో బడ్జెట్ సినిమాగా వచ్చిన ప్రేమమ్ సినిమా ఏకంగా రూ.70 కోట్లు సంపాదించింది. ఆ తరువాత అనుపమ కు తెలుగు, తమిళం, కన్నడ సినిమాలలో ఆఫర్స్ రావడం మొదలయ్యాయి. సినిమాల్లో అనుపమ ముందు అంతా హోమ్లీ పాత్రలే చేసింది. కుందనపు బొమ్మలా అనిపించే అనుపమ 'అ ఆ', 'శతమానం భవతి' సినిమాలలో తను పోషించిన పాత్రలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. అయితే ఆ తరువాత అనుపమ నటించిన సినిమాలన్నీ పెద్దగా ప్రేక్షకులకు రుచించలేదు. దీంతో అనుపత తన రూటు మార్చింది అనుపమ ఒక్కసారి బరువు తగ్గి టోన్డ్ ఫిజిక్ సాధించింది.

ఆ తరువాత టిల్లు స్క్వేర్ సినిమాలో చాలా డిఫరెంట్ గా కనిపించింది. టిల్లు స్క్వేర్ సినిమాలో అనుపమ తన నటనతో పాటు అందాల ఆరబోతలో రెచ్చిపోయింది. ఆమె పాత్ర కూడా అందుకు తగ్గట్టు చాలా థ్రిల్లింగ్ గా ఉంది. సిద్దు జొన్నలగడ్డతో చేసిన రొమాంటిక్ సీన్ల ను ప్రేక్షకులు బాగా ఎంజాయ్ చేశారు. సినిమాలో అనుపమ కిస్సింగ్ సన్నివేశాలు, గ్లామర్ సీన్లలో ఏ మాత్రం సంకుచితంగా అనిపించలేదు. సినిమా ప్రెస్ మీట్ లో మీడియా ఆమెకు ఇంత డిఫరెంట్ గా ఫుల్ రొమాంటిక్ సీన్లు ఎలా చేశారు? అని అడిగితే.. రోజూ ఒకే భోజనం చేస్తే బోర్ కొడుతుంది. అందుకే డిఫరెంట్ ఉండాలని, వెరైటీ కోసం చేశాను అని చెప్పింది. కథ నచ్చితే బోల్డ్ గా నటించేందుకు సై అంటు ప్రకటన కూడా చేసేసింది.



## 'ఆగ్రా' బోల్డ్ సీన్లపై రుహానీ క్లారిటీ...

'చిలసౌ' అనే తెలుగు సినిమాతో రుహానీ శర్మ హీరోయిన్‌గా పేరు తెచ్చుకుంది. దీని తర్వాత టాలీవుడ్‌లో అడపాదడపా మూవీస్ చేస్తూనే ఉంది. అయితే ఈమె ప్రధాన పాత్రలో నటించిన 'ఆగ్రా' అనే హిందీ సినిమా గతేడాది కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శించారు. ప్రశంసలతో పాటు అవార్డులు కూడా వచ్చాయి. తాజాగా ఈ బోల్డ్ కంటెంట్ ఉన్న మూవీ.. అమెజాన్ ప్రైమ్‌లోకి వచ్చింది. 'ఆగ్రా' సినిమాలో శ్రుతిమించిన శృంగార సన్నివేశాలు ఉండటంతో మన దగ్గర స్ట్రీమింగ్‌లోకి రాలేదు. కానీ పైరసీ సైట్లలో కనిపించింది. దీంతో కొందరు ప్రేక్షకులు ఈ సినిమాలో బోల్డ్ సన్నివేశాలు చూసి షాకయ్యారు. రుహానీ శర్మ ఇలా చేసిందేంటి అని ఆమెని విమర్శిస్తూ తెగ ట్రోల్ చేస్తున్నారు. ఈ విషయం ఈమె వరకు వెళ్లడంతో స్పందించింది. పెద్ద నోట్ రిలీజ్ చేసింది. "అందరికీ హాయ్. నేను నటించిన 'ఆగ్రా' సినిమా లీక్ అయింది. నెలల తరబడి మేం పడ్డ కష్టం ఇలా వృథా అవుతుందనుకోలేదు. అప్పటి నుంచి ఓ విషయం మాట్లాడాలనుకుంటున్నాను. నేను చాలా అసంతృప్తికి గురయ్యాను. ఆర్ట్ ఫిల్మ్ తీయడమంటే ఆషామాషీ కాదు. ఎన్నో నిద్రలేని రాత్రులు, ఇబ్బందులు ఉంటాయి. ఇవేవి చూడకుండా నా గురించి నోటికొచ్చినట్లు మాట్లాడటం, నన్ను జడ్జ్ చేయడం నిజంగా దారుణం. 'ఆగ్రా' సినిమా గతేడాది కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శించారు. నటిగా ఇది నాకెంతో గర్వ కారణమైన విషయం. అంతర్జాతీయ గుర్తింపు తెచ్చుకుని, అవార్డులు పొందిన ఈ చిత్రం విషయమై నా నిర్ణయానికి నేను కట్టుబడి ఉంటాను. ఫిల్మ్ మేకింగ్ గురించి మీకేం తెలియకపోతే ఏది పడితే అనొద్దు. కాస్త గౌరవమిచ్చి మాట్లాడండి. అవసరమైతే ప్రోత్సాహించండి కానీ మేం పడ్డ శ్రమని తక్కువ చేసి చూడొచ్చు' అని రుహానీ శర్మ భావోద్వేగానికి లోనైంది.

